# ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!

డా॥ పోతుకూచి వెంకటేశ్వర్లు

"కార్మికుల సమైక్యత – వర్ధిల్లాలి."

"కర్షకుల న్యాయమైన కోర్కెలను తీర్చాలి."

"ప్రజాస్వామ్యం – పునరుద్ధరించాలి."

"ప్రతి పౌరుడికి పనిచేసే హక్కు కల్పించాలి."

"ప్రతి పౌరుడికి పని చూపించే బాధ్యత – ప్రభుత్వం వహించాలి,"

"ప్రజాస్వామ్యం – పునరుద్ధరించాలి."

మంత్రిగారి కాంపౌండు గేటు బయట నుంచి వస్తున్న గావుకేకలు అవి. మాడేప్రేగు ల్లోంచి వెలువడిన పొగలు అవి. ఉద్రిక్తతతో రేగిన సెగలు అవి.

అన్నీ వినబడుతున్నా వినబడనట్లే మౌనంగా వున్నారు అమాత్యులవారు. అయినా అవటానికి బావమరిదే అయినా పర్సనల్ సెక్రటరీ హోదాలో పోలీసులకు ఫోను చేసాడు.



పోలీసులు హుటాహుటిన వచ్చేసారు. గాలిలో లాఠీలు ఝుళిపించారు. దాన్ని ఆటకిందే జమకట్టారు – చదువు రాకపోయినా పొట్ట నింపుకోవాలనే ఆశతో అక్కడ మూగిన జనం.

ఇంతలో భాష్పవాయు గోళాలు ప్రయోగింపబడ్డాయి. ఆ వాసన లోపలిదాకా వెళ్లిందో ఏమో దాన్ని మరిపించటానికి ఫారిన్ టానిక్ బాటిల్ ఓపెన్ చేసారు. పి. యస్. సుతారంగా గ్లాసులోకి వొంపుతుంటే సోడా, ఐస్ కలిపి రెండు రౌండ్లు పూర్తి చేసేసరికి బైట గాలిలో రెండు రౌండ్లు తుపాకీ గుళ్ళు పేలిన శబ్దం వినిపించింది.

ఇప్పటికి స్థిమితపడినట్లున్నారు. ధైర్యం గూడు చేసుకున్నట్లయింది కాబోలు – బాధ్యత గుర్తు వచ్చినట్లు మంత్రిగారు పి. యస్. ని. అదో విధమైన తిట్లు తిడుతూ బయటకు వచ్చారు. వస్తూనే పోలీసులమీద విరుచుకు పడ్డారు. "ఏమిటీ అమానుషం? ఎందుకు జరిగింది బాష్పవాయువు ప్రయోగం? ఎవరి పర్మిషన్‌తో తుపాకీ తూటాలు వెలువడ్డాయి?"

"వాళ్ళు నా జనం– నా ప్రజలు– నన్ను గెలిపించిన మనుషులు– నాకోసం– నాతో వాళ్ళ

కష్టాలు చెప్పుకోవటానికి వస్తే యిలాగా మీరు ప్రవర్తించేది ? ఇలాగేనా అంటా ! ఇదేనా మీ క్రమశిక్షణ ?'' అంటూ రౌద్ర మూర్తిలా వూగిపోతున్న అమాత్యులవారిని చూచి తలలు వంచుకుని నిలబడ్డారు పోలీసు బలగం అంతా.

ఠీవిగా ప్రజలవైపుకు ఓ అడుగు ముందుకు వేసారు. రెండో అడుగు వేయబోయి ఆగి పోయారు— బహుశా వారిని లేదా వారికి అంత దూరంలోనే వుంచాలనే వుద్దేశ్యం అయి వుంటుంది మంత్రిగారిది.

''సోదరులారా— నా ప్రజలారా— జరిగిన అన్యాయానికి చింతిస్తున్నాను. మీ కష్టాలు వినేందుకు నేనెప్పుడూ సిద్ధమే. అయితే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సంప్రదింపుల ద్వారా పరిష్కారం ఆలోచించాలి. అంతేగాని యిలా మూకుమ్మడిగా దాడిచేస్తే యిలాంటి విషమ పరిస్థితులే ఎదురౌతాయి. అందుకని మీలో ఒకరో, యిద్దరో యిక్కడగాని లేదా లోపలకు వచ్చిగాని మాట్లాడవచ్చు. సమస్యలు అర్థం చేసుకుందాం. పరిష్కారం ఆలోచిద్దాం...''

''జిందాబాద్—మంత్రిగారికి—జిందాబాద్—జిందాబాద్''

''పొగడ్తలు వద్దు— ఆవేశంలో— మీ సమస్యలు...'' అంటుండగానే వారిలోనుంచి ఓ యువకుడు ముందుకు వచ్చి ''అయ్యా—సమస్యలు పాతవే— మీకూ తెలిసినవే— పట్టా చేత పుచ్చుకున్నా పొట్ట నింపుకోలేక పోతున్నాం. కొన్ని ఏళ్ళ క్రితం ఎంప్లాయిమెంటు ఎక్చేంజ్‌లో పేరు నమోదు చేయించుకున్నా— పరపతి లేనివారి పేరు బయటకు రావటం లేదు — నిరుద్యోగం మహమ్మారిలా తయారయింది. తమరు ఎలక్షన్ల ముందు ఎన్నో వాగ్దానాలు చేసారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. తర్వాత ఏకంగా ఉద్యోగాలే ఇస్తామని— వయస్సు మళ్ళుతున్నవారిని (మేధావులు — ఆరోగ్యవంతులు అయినాసరే) యిళ్ళకు పంపారు. అయినా మాకంటూ యింతవరకు వొరిగిందేమీ లేదు. జరిగే మేలు కనబడటం లేదు — ఎంత కాలం యిలా మాడాలి — యింకెంత కాలం ఇలా అలమటించాలి. చన్నీళ్ళకు వేడినీళ్ళు తోడౌతాయని అన్నట్లు — మా నాయన జీతానికి నా ఆర్జన జతపర్చుకుందామనుకుంటే — అసలు నీరే లేకుండా పోయింది — మా నాయన రెటైర్ అవ్వాల్సిరావటం — నాకా ఉద్యోగం లేకపోవటం— యిలాగే ఎన్నో సంసారాలు ఎలా గడవాలి ? ఎంత కాలం గడపాలి ... ?''

చిరునగు మోముతో మంత్రివర్యులు అందుకున్నారు ''సోదరులందరికీ నా అభినందనలు. మీ కష్టాలు నా కష్టాలుగా భావించేవాళ్ళలో నేనొకడినని మీకు తెలుసు — అందుకే మీరు నా దగ్గరకు వచ్చారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు'' అంటూ చేతులు జోడించారు. ''ప్రభుత్వంలో వున్నంత మాత్రాన — ప్రజా ప్రతినిధులమైనంత మాత్రాన అన్నీ సాల్వ్ చెయ్యలేం. అందుకే కొంతవరకు యిటు ప్రజలు పూనుకోవాలి — అటు సెంట్రల్ అసిస్టెంన్స్ వుండాలి — సమానత్వం — నవసమాజం కల్పించాలంటే — యిందుకు మీరు తోడ్పడాలి. అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు చూపించే స్థితిలోలేదు — యిందుకు ఆర్థిక స్తంభన అని సిగ్గుపడాలో—విద్యావేత్తలు పెరిగిపోతున్నారని గర్వపడాలో తోచని స్థితి. ఏమైనా యిది సాల్వ్ చేయాలంటే మీ కృషి అవసరమే ! ఎవరికివారు స్వయం ఉపాధికల్పనా పథకాలు ఎంపిక చేసుకోవాలి — అంతవరకు ఎందుకు నా ఫ్యామిలీనే తీసుకోండి—నా బావమరది పి.యస్. పోస్టు సంపాదించుకున్నాడు — నా రెండో కొడుకు ఫారంలో మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు—నా ఒక్కగానొక్క కూతురు ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా ఎపాంటు అయింది— ఈ కోణంనుంచి ఆలోచిస్తే నా కుటుంబసభ్యులు వారివారి ప్రయత్నాలలో నిరుద్యోగ సమస్య పరిష్కరించుకున్నారు. ఇందులో నా ప్రమేయం గాని ప్రయత్నంగాని ఏమీ లేదని మనవి చేస్తున్నాను. అలాగే మీరు ఏదో ఓ పథకం లేదా ఉద్యోగం సంపాదించాలి. అంతేగాని అంతా ప్రభుత్వమే చెయ్యాలంటే యిది ఎలా సాధ్యం? ఎలా సాధ్యపడుతుందీ అని అడుగుతున్నాను. అయినా యింతమందికి వున్నపళంగా వుద్యోగాలు కావాలంటే సాధ్యపడేదేనా ? అని మనవి చేస్తున్నాను.''

ఇంతలో అక్కడకు హడావిడిగా వచ్చిన కొందరు వందిమాగదులు ''మంత్రిగారికి జై— ప్రజాబంధుగారు జిందాబాద్'' అనే వారి అరుపులు లాఠీ మోతలతో ప్రతిగలిపాయి.

క్షణంలో అంతా సద్దుమణిగింది.

ప్రశాంత పరిస్థితి ఏర్పడింది.

శాంతంగా ''ప్రశాంతి'' నిలయంలోనికి నడిచారు మంత్రిగారు.

అయితే లాఠీల తాకిడికి చెల్లాచెదరైన జన సమూహం ఎక్కడికి చేరినట్లు ?

యిళ్ళకే చేరారో ?

పోలీసు స్టేషన్‌కి వెళ్ళారో ?

హాస్పిటల్‌కి తరలింపబడ్డారో !

అది అప్రస్తుతం— అనవసరం

కావలసిందల్లా

ప్రజాస్వామ్యం ? వర్థిల్లాలి ! ★

